యాదమరిలో నీవా నది ఉధృతం

ప్రజాశక్తి -యాదమరి: యాదమరి మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీవానది ఉరకలు పరుగులతో నీటి ప్రవాహం పోటెత్తుతోంది. యాదమరి వరదరాజుల స్వామి గుడి వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో యాదమరి తహశీల్దార్ పార్థసారథి యాద మరి సబ్ ఇన్స్పెక్టర్ ఈశ్వరయ్య నదీ ప్రవాహాన్ని, నీ వానది పరివాహ ప్రాంతాల్లోని ఇండ్లను పరిశీలించారు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో సమీపంలోని ప్రజల అప్రమత్తంగా ఉండాలని చిన్నపిల్లలు పెద్దలు నీటి ప్రవాహం దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. జోడి చింతల వద్దనున్న మాదిరెడ్డిపల్లి వెళ్ళు దారిలో, 14 కండ్రిగచిన్ రెడ్డి పల్లి గ్రామాలకు వెళ్లే దారిలో నదీ ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఆ గ్రామాలకు వెళ్లే ప్రజలు మీరు ఎక్కువగా ప్రవహిస్తున్నప్పుడు వారి దారిలో వెళ్లొద్దని అధికారులు ప్రజలకు సూచించారు.

రెవెన్యూలో ప్రతి పనికీ 'ఓ రేటు'

- పైసలిస్తేనే ఫైలు దులుపుతారు
- విఆర్ఒలు, సర్వేయర్ల ఆగడాలు
- యాదమరి రెవెన్యూలో అంతులేని అవినీతి
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితులు

ప్రజాశక్తి - యాదమరి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉండేది ప్రజా సమస్యలు పరిష్కరించడానికి.. అయితే 'రెవెన్యూ విభాగమే మా సమస్య' అంటూ ప్రతి సోమవారం జరిగే కార్యక్రమంలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అగ్రభాగాన నిలిచేది రెవెన్యూ సమస్యలే.. అధికారులు సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.. అయితే అధికారులే సమస్యగా మారారు యాదమరి రెవెన్యూలో.. సర్వే చేయడానికి రూ.2,500, పొజిషన్ సర్టిఫికెట్ కావాలంటే రూ.10వేలు... ఇలా ప్రతి పనికీ ఓ రేటు ఉంటుందన్నమాట.. రోజురోజుకూ విఆర్ఒలు, సర్వేయర్ల ఆగడాలు శృతిమించుతున్నాయి.. అదేమని ఎవరైనా అడిగితే పైనుంచి కిందివరకూ సమర్పించుకోవాల్సిందే అంటూ సన్నాయి నొక్కులు.. అవినీతి ఏ స్థాయిలో ఉందంటే బాతులు మేపుకొనే ఎస్టీ కులం వాళ్ల దగ్గరా దందా చేస్తున్నారు మరి.

యాదమరిలో ఇలాంటి బాధితులు ఒకరు కాదు, ఇద్దరు కాదు.. ఎందరో.. కొంతమంది మీడియా దృష్టికి తెస్తుంటే, మరికొంతమంది మీడియాకు చెబితే పూర్తిగా పనిచేయరేమోనన్న భయంతో బాధితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. యాదమరిలో కాళ్లరిగేలా తిరిగి తిరిగి విసిగి వేసారి, కలెక్టరేట్‌కు చేరుకుని, స్వయానా కలెక్టర్‌కు అర్జీలను ఇస్తున్నారు. అయినా వారి సమస్యలు పరిష్కారం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. రెవెన్యూ సమస్యలపై కలెక్టర్ వారం వారం తహశీల్దార్లతో సమీక్ష చేస్తుంటారు. అయినా భూ సమస్యలు తగ్గడం లేదు. కిందిస్థాయి సిబ్బంది క్షేత్రస్థాయి సమాచారంతో నిమిత్తం లేకుండానే పరిష్కరించినట్లు కాకిలెక్కలు చూపుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో భూముల విలువలు అధికంగా పెరగడంతో అక్రమాలు అధికమయ్యాయి. పాసుపుస్తకాల అడంగళ్లు, వన్‌బి పేరు మార్పులు తదితర పనులకు ధరలు నిర్ణయించి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. భూ సరిహద్దులు, సబ్ డివిజన్ చేసేందుకు భూ సర్వే ఇలా ప్రతి పనికీ ఓ రేటు. మండలస్థాయిలో అధికంగా లంచాలు డిమాండ్ చేస్తుండడంతో ప్రజలు కలెక్టర్ కార్యాలయానికి క్యూ కడుతున్నారని సమాచారం.

చక్రం తిప్పుతున్న విఆర్ఒలు

గ్రామాల్లో విఆర్ఒలు చక్రం తిప్పుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెబ్‌ల్యాండ్‌లో మాయాజాలం చేసేదంతా వీరే. ఒకరి సర్వేనంబర్లు మరొకరి పేరిట, ఒకరి భూములను మరొకరి పేరుతో మార్చేయడం, వారు చేసిన తప్పులను మళ్లీ వారే లంచాలు దండుకుని సరిజేయడం రివాజుగా మారింది. యాదమరి మండలంలో ప్రస్తుతం కుల ధృవీకరణ పత్రం, డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, పొజిషన్ సర్టిఫికెట్, ఇంటి పట్టా, ముటివేషన్స్, రీ సర్వేలో కరెక్షన్స్ ఇలా ప్రతిదానికి ఒక రేటు వెయ్యి రూపాయల నుండి పదివేల వరకు నిర్ణయించి ప్రజల వద్ద నుంచి దండుకుంటున్నారనే విమర్శలు దండిగా ఉన్నాయి.

సర్వే చేసేందుకు 2500 ఇచ్చా : గాయత్రి

నా పేరు గాయత్రి మా ది గుట్టకుంద ఊరు గ్రా మం, యాదమరి గ్రామ రెవెన్యూ గ్రామ కంఠం సర్వేనెంబర్ 518 నందు మా ఇంటి పొజిషన్ సర్టిఫికెట్ తీసుకునేందుకు మండల సర్వేయర్ వచ్చి సర్వే చేశారు. సర్వే రిపోర్ట్ ఇచ్చేందుకు నా దగ్గర నుండి 2,500 తీసుకున్నారు.

పొజిషన్ సర్టిఫికెట్‌కు రూ.10వేలడిగారు : టి.రమ్య

మాది సంత గేటు. మాకు వరద రాలపల్లి రెవెన్యూ గ్రామంలో ఇంటి స్థలం ఉంది. ఇందుకు పొజిషన్ సర్టిఫికెట్ కావాలని గత మూడు నెలలుగా యాదమరి తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. విలేజ్ సర్వేయర్ వచ్చి చూసి వెళ్లారు. వీఆర్వోను వెళ్లి కలిస్తే నీకు సర్టిఫికెట్ కావాలంటే 10000 అవుతుందని తెలిపారు. నేను ఎస్టి కులానికి చెందిన వారము బాతులు మేపుకొని జీవనాధారం చేసుకుంటున్నాము. మాకు పదివేలు ఇచ్చే స్తోమత లేదు . పై అధికారులు స్పందించి మా అనుభవంలో ఉన్న భూమికి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరుతున్నాను.

ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదు: పి లత

యాదమరి మండల తహశీల్దార్‌కు అనేకమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతో కలెక్టరేట్‌కు వచ్చానని, నెలరోజులైనా ఇప్పటివరకూ ఎవరూ తన భూ సమస్యను పరిష్కరించలేదని ఓటేరిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన పి.లత ఆవేదన చెందారు.

రెవెన్యూ అవినీతిపై దృష్టి పెట్టాలి:

రెవెన్యూ కార్యాలయాల్లో పేదలకు సంబంధించిన భూముల విషయంలో పేదలను ఇబ్బంది పెడుతూ అవినీతికి పాల్పడుతున్న అధికారు లపై చర్యలు తీసుకోక పోవడంతో కింది స్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. యాదమరి మండలంలో అవినీతి బాగోతం జిల్లాలో ప్రతి తహశీల్దారు కార్యాలయంలో జరుగుతోంది.. పై అధికారులు పరిష్కరించాలి..

- వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కన్వీనర్.

జాతీయ రహదారి అస్తవ్యస్తం

ఆదమరిస్తే ప్రాణాలకు ప్రమాదమే

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: కడపనత్తం నుండి బైరెడ్డిపల్లి వరకు సాగుతున్న జాతీయ రహదారి అత్యంత దురవస్థలో ఉంది. ఇరువైపులా పాక్షికంగా క్షీణించిన రోడ్డులు, వంకలు తలపించే మలుపులు, రహదారిపై పగుళ్ల..ఇవన్నీ ప్రయాణికులకు భయాందోళనలు కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ఈ మార్గంలో సుమారు 11 గ్రామాల విద్యార్థిని విద్యార్థుల . ప్రజలు రోజూ ప్రయాణం చేస్తూ ఉండటంతో, వారి ప్రాణాలు ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడింది.

సామాజిక మాధ్యమాల్లో వాహనదారులు, స్థానికులు పలు మార్లు ఈ సమస్యపై శబ్దం చేశారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేకపోవడం బాధాకరం. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాల్సిన సమయంలో మౌనం పాటించడం నిందనీయం.వాహనదారులు చెబుతున్నట్లుగా, ఈ దారిలో రాత్రివేళ ప్రయాణించడం అంటే అరి చేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణించడం లాంటిదే. రహదారి పరిస్థితి వల్ల ఇప్పటికే పలుచోట్ల చిన్నాపెద్దా ప్రమాదాలు నమోదయ్యాయి. ఇప్పటికైనా రోడ్డు రవాణా శాఖ అధికారులు స్పందించి తగిన మరమ్మతులు చేపట్టాలి. లేకపోతే, ప్రజల ప్రాణాలకు ముప్పు తప్పదని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

వాహనదారులకు వినతి

ఇది జాతీయ రహదారి అన్నది నమ్మశక్యం కాదు. ఈ దారిలో రాత్రిళ్లు ప్రయాణించడం అంటే ప్రాణాల పండుగే. మా విన్నపాన్ని అధికారులు పరిగణలోకి తీసుకొని వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుకుంటున్నాం."

స్థానికులు తక్షణ స్పందన అవసరం

ప్రస్తుత పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత శాఖల అధికారులు వెంటనే రంగంలోకి దిగాలి. రోడ్డు పూర్తిగా మరమ్మతు చేయకపోతే, రానున్న రోజుల్లో పెద్ద ప్రమాదాలు సంభవించే అవకాశముంది.

ప్రజామద్దతుతో.. కార్మిక ఉద్యమాలు

- బిజెపి పాలనలో కార్మికచట్టాలకు ప్రమాదం
- సిఐటియు జిల్లా మహాసభల్లో సిహెచ్ నర్సింగరావు
- ఉత్సాహపూరితంగా ప్రతినిధుల సభ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, పుత్తూరు టౌన్

మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

'ప్రజామద్దతును కూడగట్టుకుని భవిష్యత్ కార్మిక ఉద్యమాలను తీవ్రతరం చేయాల్సిన ఆవశ్యకత ఉంది' అని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. కేంద్రంలో మతతత్వ బిజెపి పాలన కార్మికులను విభజించి పాలించు అన్న రీతిలో సంస్కరణలను తీసుకొచ్చి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందన్నారు. దేశంలో కార్మికుల పక్షాన నీతిగా, నిజాయితీగా నికరంగా సమరశీల పోరాటాలు చేస్తున్న సంఘం 'సిఐటియు' మాత్రమేనన్నారు. సిఐటియు తిరుపతి జిల్లా 8వ మహాసభ పుత్తూరు పట్టణంలో ఉత్సాహపూరితంగా సోమవారం నిర్వహించారు. అనంతరం కుప్పా నాయుడు, సీతారాం ఏచూరి చిత్రపటాలకు నివాళి అర్పించారు. అనంతరం ప్రతినిధుల సభ ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. బహిరంగసభకు సిఐటియు జిల్లా అధ్యక్షులు జిబిఎస్ మణ్యం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ మతతత్వ బిజెపి పాలనలో దేశరక్షణ సాధ్యం కాదన్నారు. కార్మిక రాజ్యంతోనే ఈ దేశ సుపరిపాలన, దేశరక్షణ సాధ్యమన్నారు. కార్మిక రాజ్యాన్ని సాధించాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యపరుస్తూ ఐక్య ఉద్యమాలకు తెరదీయాలన్నారు. సామ్రాజ్యవాదానికి నాయకత్వం వహిస్తున్న అమెరికా చేస్తున్న విధానాలపై 'జి7' దేశాల్లోనూ వ్యతిరేకత మొదలయ్యిందన్నారు. ముఖ్యంగా ట్రంపు విధిస్తున్న సుంకాల భారంతో దేశంలో, రాష్ట్రంలో పౌల్ట్రీ, ఆక్వా, వస్త్ర, పాడి పరిశ్రమ తదితర రంగాలన్నీ పూర్తిగా దెబ్బతింటాయన్నారు. కొన్ని కోట్ల మంది భారీగా నష్టపోతారన్నారు. అయితే ట్రంపు విధిస్తున్న సుంకాలపై ఎదిరించే దమ్ము, ధైర్యం మోడీకి లేదన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి మతతత్వ ప్రభుత్వంలో ప్రమాదం ఏర్పడిందన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల కారణంగా ఏ ఒక్కరూ బతికి బట్టకట్టే పరిస్థితి లేదన్నారు. కార్మిక హక్కులను కుదించి సంక్షేమ పథకాలను క్రమంగా రద్దుచేసే ప్రయత్నాలు పాలకులు చేస్తున్నారన్నారు. కార్మికుల శ్రేయస్సు పక్కన పెట్టి కార్పొరేట్ అనుకూల విధానాలను తీసుకొచ్చేందుకు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చారన్నారు. కార్మికులు దేశవ్యాప్త సమ్మెతో లేబర్‌కోడ్‌ల అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి ధైర్యం చాలలేదన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, అంగేరి పుల్లయ్య, దాసరి జనార్ధన్ ప్రసంగించారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడుతో పాటు బృందం సిఐటియు మహాసభలకు సంఘీభావం ప్రకటించారు. ప్రతినిధులసభలోనూ, బహిరంగసభలోనూ సిఐటియు సంఘాల జిల్లా నాయకులు టి.సుబ్రమణ్యం, ఆర్.లక్ష్మి, వాణీశ్రీ, ఎస్.జయచంద్ర, కెఎల్ఎన్ ప్రసాద్‌రావు, ఆర్.వెంకటేష్, గోల్కొండ వెంకటేశం, మునిరాజా, బుజ్జి, మాధవ్, వేణుగోపాల్, ఎన్‌డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్న వీవోఏలు

పోరాట ఫలితం

- కాల పరిమితి రద్దు
- వీవోఏల విజయోత్సవం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పోరాట ఫలితంగా మూడు సంవత్సరాల కాల పరిమితి రద్దు సందర్భంగా చిత్తూరు జిల్లా వివోఏలు సోమవారం కాణిపాకంలో జరిగిన సమావేశంలో కేక్ కట్ చేసి విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ ఆన్‌లైను వర్క్ ఆపేసి పెద్ద ఎత్తున పోరాటం చేయడంతో ప్రభుత్వం దిగివచ్చి మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయడంతో పాటు తొందరలో ఫోన్లు 5జి సిమ్ ఇస్తామని సర్క్యులర్ జారీ చేయడం అభినందనీయమన్నారు. ఇదే పోరాట స్ఫూర్తితో వివోఏలు భవిష్యత్తులోనూ సమస్యలు పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 26వ తేదీ జిల్లా మహాసభ చిత్తూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో జిల్లాలోని వివోఏలందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి యూనియన్ జిల్లా అధ్యక్షుడు జీను రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి శ్రీధర్ బాబు, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి వసంతమ్మ , ఉపాధ్యక్షులు చంద్రబాబు, మంగమ్మ, నాయకులు మని, కళావతి పాల్గొన్నారు.

నకిలీ మద్యం విక్రయాలు అరికట్టండి

ఎక్సైజ్ స్టేషన్ ఎదుట వైసిపి ధర్నా

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రజల ప్రాణాలను బలిగొట్టున్న కల్తీ మద్యం అరికట్టి బెల్టుషాపులను కట్టడి చేయాలని కోరుతూ వైసిపి నాయకులు స్థానిక వివేకానంద విగ్రహం నుండీ ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వైసిపి నియోజవర్గ ఇన్‌చార్జి ఎంసి విజయానందరెడ్డి, రాహురాజారెడ్డి, జ్ఞానజగదీష్ మహిళా నాయకులు గాయత్రిదేవి, హరిణిరెడ్డిలు మాట్లాడుతూ విచ్చలవిడిగా నకిలీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయని దీన్ని అరికట్టాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ మండిపడ్డారు. నకిలీ మద్యంపై కూటమి ప్రభుత్వం స్పందించి స్వచ్ఛందంగా సిబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో వైసిపి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాణ్యమైన పరిష్కారం చూపాలి

- అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పని చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.ఆర్.యస్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన 364 అర్జీలను కలెక్టర్ సుమిత్ కుమార్ స్వీకరించారు.. కలెక్టర్ తో పాటు ప్రజల నుంచి అర్జీ స్వీకరించే కార్యక్రమంలో డి ఆర్ ఓ కె. మోహన్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ విజయ లక్ష్మి, కుసుమ కుమారి, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏ ఓ వాసుదేవన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబందించిన అధికారులు పాల్గొన్నారు.

ఆక్రందన సభను అడ్డుకుంటే అభాసు పాలే..

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఈ నెల 15వ తేదీన బంగారు పాలెంలో మామిడి రైతు సంఘం, ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆక్రందన సభకు మూడు జిల్లాల నుండి విశేష స్పందన వస్తున్నట్లు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి జనార్ధన్, సి మునీశ్వర్ రెడ్డి, కార్యదర్శి, బి శ్రీనివాసులు, కోశాధికారి పిఎల్ సంజీవరెడ్డిలు పేర్కొన్నారు. ఆక్రందన సభ విజయవంతం కోసం పి కొత్తకోట, పూతలపట్టు, యాదమరి మండలం కొట్టాల గ్రామాలలో వారు సోమవారం విస్తృతంగా పర్యటించి రైతులను కలసి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల్లో స్పందన అమోఘంగా ఉందని బంగారుపాలెం లో జరిగే ఆక్రందన సభ పెద్ద ఎత్తున జయప్రదం కావడం ఖాయమని పేర్కొన్నారు. రైతులు, తాము సరఫరా చేసిన మామిడి బిల్లుల ఆలస్యం కావడానికి ప్రభుత్వంతో పాటు గుజ్జు ఫ్యాక్టరీ యజమానులే ప్రధాన బాధ్యతగానే భావిస్తున్నారని తెలిపారు. గుజ్జు ఫ్యాక్టరీలకు ప్రభుత్వ పెద్దల నుండి పరోక్ష సహకారం ఉండడంతోనే రూ.8 చెల్లించడంలో తీవ్ర ఆలస్యం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం 40 మంది ప్రయోజనాల కోసం 40 వేల మంది రైతుల ప్రయోజనాలు తాకట్టు పెట్టడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడే ఏ ప్రభుత్వమైనా, శక్తులైనా దీర్ఘకాలం మనుగడ సాధించలేవని అన్నారు. రైతులకు కులాలు, మతాలు అంట కట్టేందుకు కొందరు నేతలు విషం చిమ్ముతున్నారని అలాంటి వారిని ఎండగట్టేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.

మామిడి రైతుల సభకు సిపిఎం, సిపిఐ మద్దతు

చిత్తూరు అర్బన్: మామిడి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ప్రభుత్వం నుండి నాలుగు రూపాయలు, యాజమాన్యాల నుండి ఎనిమిది రూపాయలు మొత్తం 12 రూపాయలు చెల్లించాలని నిర్వహిస్తున్న మామిడి రైతుల ఆక్రందన సభకు సిపిఎం, సిపిఐ మద్దతు ఇస్తున్నట్లు రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యను సమస్యగా చూడాలే తప్ప రాజకీయం చేయొద్దని రైతులు సమస్యలు పరిష్కారం కోసం రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం, అధికారులు ముందుకు రావాలని కోరారు. ఈ నెల 15వ తేదీ బంగారుపాళ్యంలో జరిగే సభకు మార్కెట్ యార్డ్‌లో అనుమతి ఇవ్వకపోవడం దారుణం అన్నారు. రైతుల కోసం పనిచేసే వారు ఇలాంటి వ్యతిరేక ఘటనలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు రైతుల ఆక్రందనకు మద్దతుగా నిలవాలని కోరారు. 15వ తేదీ జరిగే సభలో ఉమ్మడి జిల్లా రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రశాంతంగా దీపావళి నిర్వహించాలి: ఆర్‌డీవో

ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి): ప్రశాంత వాతావరణంలో దీపావళిని నిర్వహించుకోవాలని చిత్తూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం శ్రీనివాసులు తెలిపారు. చిత్తూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఆర్‌డివో ఆధ్వర్యంలో దీపావళి పండుగ నిర్వహణ పై పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, టపాకాయల విక్రయదారులతో సమన్వయ సమావేశం సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డివో మాట్లాడుతూ పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా శాంతి భద్రతలకు ఇబ్బందులు లేకుండా దీపావళి నిర్వహించుకోవాలని టపాకాయల విక్రయదారులు కమిటీ సభ్యులకు సూచించారు. టపాకాయల అమ్మకానికి స్థల నిర్ధారణ విషయమై అగ్నిమాపక, పోలీస్ శాఖ, మున్సిపల్ శాఖ, విద్యుత్ శాఖ, సెక్రెటరీ మార్కెటింగ్, ఇరిగేషన్ శాఖ, టపాకాయల అసోసియేషన్ డీలర్స్ తదితరులతో వన్ మాన్ కమిటీ నియమ నిబంధనలను అనుసరించి చిత్తూరు ఆర్‌డివో కార్యాలయంలో సమావేశం నిర్వహించామని తెలిపారు. టపాకాయల అమ్మకానికి కట్టమంచి వద్ద ఉన్న మామిడి కాయల మండి వద్ద మార్కెట్ యార్డ్‌ను పరిశీలించగా చిత్తూరు కట్టమంచి వద్ద మామిడి కాయల మండినీ ప్రజలకు సౌకర్యంగా గుర్తించి ఖరారు చేశామని రెవెన్యూ డివిజనల్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి సాయినాథ్, అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, వన్ టౌన్ సిఐ మహేశ్వర్, ఏడి మార్కెటింగ్ పరమేశ్వర్, అర్బన్ తమశీల్దారు కులశేఖర్, రూరల్ తహశీల్దారు జయప్రకాష్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ లోకేష్, సంబంధిత శాఖల అధికారులు, టపాకాయల కమిటీ విక్రయదారులు పాల్గొన్నారు.

అధికారులు, టపాకాయల వ్యాపారులతో మాట్లాడుతున్న ఆర్‌డీవో

విద్యుత్ ఉద్యోగుల బస్సు బోల్తా

- ధర్నాకు వెళుతుండగా ఘటన
- ఒకరు మృతి ,16 మందికి గాయాలు

ప్రజాశక్తి-పలమనేరు: విజయవాడలో సోమవారం ధర్నాలో పాల్గొనేందుకు మినీ బస్సులో బయలుదేరిన పలమనేరు విద్యుత్ ఉద్యోగులు సోమవారం ఉదయం మూడు గంటల ప్రాంతలో ఒంగోలు పీస్ కాలేజీ వద్ద వారి వాహనం ప్రమాదానికి గురై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మరణించారు. 16 మంది గాయపడ్డారు. ఈ ప్రమాద ఘటనపై పలమనేరు విద్యుత్తు ఎడిఈ జీవన్ కుమార్ మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటలకు విజయవాడలో నిర్వహించాల్సిన విద్యుత్ ఉద్యోగుల ధర్నాకు పలమనేరు నుంమాదివారం సాయంత్రం ఒక మినీ బస్సులో 19 మంది ఉద్యోగులు విజయవాడకు బయలుదేరినట్లు తెలిపారు. పలమనేరు మండలం నుండి పది మంది, గంగవరం మండలం నుండి ఐదు గురు, బైరెడ్డిపల్లి మండలం నుండి ఇద్దరు, బంగారు పాలెం నుండి ఒక్కరు, కుప్పం, గుడిపల్లి మండలం నుండి ఒక్కరు మొత్తం 19 మంది విజయవాడకి బయలుదేరారని తెలిపారు. మార్గ మధ్యంలో సోమవారం ఉదయం 3 గంటల సమయంలో ఒంగోలు పీస్ కాలేజీ వద్ద మినీ బస్సు డ్రైవర్ అజాగ్రత్త వల్ల అదుపుతప్పి బోల్తా పడిందన్నారు. అందులో గంగవరం మండలం పత్తికొండలో పనిచేసే జూనియర్ లైన్‌మ్యాన్ చరణ్ మృతి చెందాడన్నారు. 16 మంది గాయపడ్డారని, వారు వివిధ ఆస్పత్రు లలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. చరణ్ మృతదేహాన్ని పలమనేరుకు తెప్పిస్తున్నట్లు, గాయపడిన వారికి ఆసుపత్రిలో చికిత్స చేసేందుకు తమ సిబ్బంది ద్వారా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

గాయపడిన వారిని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

నిరాశ్రయులను ఆదుకుందాం

మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ డి రవీంద్ర

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుని పై ఉందని చిత్తూరు మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ బి రవీంద్ర పేర్కొన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థ మెప్మా సహకారంతో సపోర్ట్ సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సంబరాల్లో భాగంగా సోమవారం నూతన వస్త్రాలను ఆ సంస్థ అధ్యక్షులు జోసఫ్ రాజు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ డి రవీంద్ర మాట్లాడుతూ నిరాశ్రయులు గతంలో కుటుంబ సభ్యులతో కలిసి ఉండేవారన్నారు. అయితే ఎవరు లేకపోవడంతో నిరాశ్రయుల వసతి గృహంలో ఉంటున్న కుటుంబ సభ్యులతో కలిసి ఉండే ఆహ్లాదాన్ని కల్పిస్తున్న జోసఫ్ రాజు సేవలు అభినందనీయమన్నారు. సపోర్ట్ సంస్థ నిర్వాహకులు నిరాశ్రయులకు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. రాష్ట్రంలో పలువురు వసతి గృహాలు నడప లేకపోయినా రాష్ట్రంలోనే మాడ్రన్ షెల్టర్ చిత్తూరు నిరాశ్ర యుల వసతి గృహం గుర్తింపు పొందడం జోసఫ్ కృషి రాజు అన్నారు.

హర్యానా సీఎం రాజీనామా చేయాలి

చిత్తూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పోటుగారి భాస్కర్

ప్రజాశక్తి -వెదురుకుప్పం : హర్యానా రాజధాని చండీగఢ్‌లో ఓ ఐపీఎస్ అధికారి తన సర్వీసు రివాల్వర్ తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని, ఇది బాధాకరమని చిత్తూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై హర్యానా ముఖ్యమంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని ఆయన సోమవారం డిమాండ్ చేశారు. ఒక సీనియర్ దళిత ఐపీఎస్ అధికారిగా, నిజాయతీ అధికారిగా పురాణ్ కుమార్ పేరు పొందారన్నారు. ఈ సంఘటనపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని సిబిఐ విచారణ జరిపించి ఇందుకు బాధ్యులైన వారిని వెంటనే శిక్షించాలని ఆయన కోరారు. పురాణ కుమార్ సతీమణి సైతం ఐఏఎస్ అధికారిగా సుమారు 25 సంవత్సరాలుగా సేవలందిస్తూ ప్రజల్లో మన్ననలు పొందారన్నారు. ఇందులో బిజెపి అగ్ర నాయకుల ఒత్తిడి వల్లే ఆయన ఇలా ఆత్మహత్య చేసుకున్నాడని ఆయన రాసిన తొమ్మిది పేజీల లేఖ ఇందుకు నిదర్శనమన్నారు. దీనికి బిజెపి నాయకుల ఒత్తిడే పూర్తి కారణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ధర్నా నిర్వహిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

జస్టిస్ గవాయ్ పై దాడి హేయమైన చర్య

కలెక్టరేట్ ఎదుట ఎంఆర్‌పిఎస్ ధర్నా

ప్రజాశకి- చిత్తూరు అర్బన్: సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్ పై దాడిని నిరసిస్తూ ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం అమూల్ డెయిరీ నుండీ కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు మాట్లాడుతూ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టు న్యాయమూర్తిపై దాడి రాజ్యాగంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. బీజేపి అధికారంలోకి వచ్చాక దళిత అధికారులపై దాడులు పెరిగాయన్నారు. రాజ్యాంగ విలువలను కాలరాస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. నిరసన అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతి చేశారు.

కొట్టాలూరును 3 పంచాయతీలుగా విభజించండి

కడ పీడీకి వినతి

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మండలం తమిళనాడు సరిహద్దులోని కొటాలూరు పంచాయతీని మూడు పంచాయతీలుగా విభజించాలంటూ స్థానిక ప్రజాప్రతినిధులు కడపిడి వికాస్ మర్మత్ కు వినతి పత్రం అందజేశారు. కొట్టాలూరు, ఎర్రమన్ను గుంతలు, గుండ్లమడుగు పంచాయతీలుగా విభజిస్తే ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని, త్వరలోనే మల్లానూరు కుప్పం రూరల్ మండల కేంద్రం కానున్న నేపథ్యంలో పెద్ద పంచాయతీని ప్రజల సౌకర్యార్థం మూడు పంచాయతీలుగా విభజించాలని సర్పంచ్ రాజేంద్ర విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కుప్పంలో ఆటోనగర్ ఏర్పాటు చేయాలని ప్రైవేట్ మెకానిక్ యూనియన్ అధ్యక్షులు శివకుమార్ పిడి కి వినతి పత్రం అందజేశారు. కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా పిడి వికాస్ మర్మత్ సోమవారం ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో కడ అడ్వైజర్ కమిటీ సభ్యుడు రాజ్ కుమార్,డీఈ లు గురువారెడ్డి, పురుషోత్తం, అధికారులు పాల్గొన్నారు.

చెరకు మద్దతు ధర పెంచండి..

కలెక్టర్‌కు రైతు సంఘాల నాయకుల వినతి

ప్రజాశక్తి -కార్వేటినగరం : చెరకు పంటకు మద్దతు ధర పెంచి చెరుకు రైతులను ఆదు కోవాలని వివిధ రైతు సంఘాల నాయకులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. సోమవారం కలెక్టర్ కార్యా లయంలో సమస్యల పరిష్కార దినోత్సవం సందర్భంగా కార్వేటి నగరం, శ్రీ రంగ రాజపురం మండలాలకు చెందిన చెరకు రైతులు చెరకు మద్దతు ధర పెంచాలని రైతు రాజేందర్ నాయుడు, రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ డైరెక్టర్, జిల్లా రైతు సంఘ అధ్యక్షులు నగలపాటి నాగేశ్వర్ రాజు మండల పార్టీ అధ్యక్షులు చెంగల్రాయ యాదవ్‌లు కలిసి కలెక్టర్‌ను వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లా డుతూ పక్క రాష్ట్రమైన తమిళనాడు ప్రభుత్వం రైతులకు చెరకు మద్దతు ధర టన్నుకు నాలుగు వేల రూపాయ లు ఇస్తున్నారని కలెక్టరుకు వివరిం చారు. ఆ ధర ఇక్కడ వచ్చేలా చూడాలని రైతులు కోరారు. అనంతరం కలెక్టర్‌కు శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోమశేఖర్ నాయుడు, చంద్ర మౌళి రెడ్డి, హరిబాబు, గోవిందరాజు, కిషోర్ రెడ్డి, చిరంజీవి రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నివారించాలి

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం నియోజకవర్గంలో గ్రామానికి 10 బెల్ట్ షాపులు ఉన్నాయని చిల్లర దుకాణాల్లో సైతం మద్యం విక్రయాలు చేపడుతున్నారని చిత్తూరు ఎమ్మెల్సీ, వైసిపి కుప్పం ఇన్‌చార్జ్ భరత్ ఆరోపించారు. కల్తీమద్యం, బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని కుప్పం వైసిపి కార్యాలయం వద్ద నుండి ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులు ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిల్లర దుకాణాల్లో సైతం మద్యం అమ్మకాలు చేపడుతున్నారని, ఈ లెక్కన గ్రామానికి 10కి పైగా బెల్ట్ షాపులు ఉన్నాయని దానిపై చర్యలు తీసుకోవాలంటే వైసిపి శ్రేణులతో కలిసి ఎమ్మెల్సీ భరత్ ఎక్సైజ్ సీఐ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఎక్సైజ్ పోలీసుల సహకరిస్తే సాయంత్రం లోపు వెయ్యి బెల్ట్ షాపులను పట్టిస్తామని వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు మురుగేష్ పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బాబు రెడ్డి,దండుపాణి, కోదండ రెడ్డి, కౌన్సిలర్లు మునిరాజ్, మోహన్ రామ్,విజయ్ కుమార్, జడ్పిటిసిలు శరవణ,నితిన్, నాయకులు భాగ్యరాజ్,ఈశ్వర్, జీవి రమేష్ పాల్గొన్నారు.

కార్వేటినగరం: పచ్చని పల్లెల్లో నకిలీ మద్యం, బెల్టు షాపులు ఏర్పాటుతో పేద కుటుంబాలు గుల్లవుతున్నాయని జీడీనెల్లూరు నియోజకవర్గం వైసిపి సమన్వయ కర్త కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎక్సైజ్ కార్యాలయం వద్ద నకిలీ మద్యం అమ్మకాలపై సోమవారం నిరసన తెలిపారు. అనంతరం ఎక్సైజ్ సీఐకి వినతిని అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం సమన్వయకర్త మాట్లాడుతూ పచ్చని పల్లెలో పాలుకన్న నకిలీ మద్యమే ఎక్కువగా లభిస్తున్నాయని అన్నారు. పారుతున్న మద్యంతో పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, అదే కాకుండా కుటుంబ పెద్ద దిక్కును చిన్న వయస్సులోని కోల్పోతున్నారని విమర్శించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ సీఐకి వినతిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు రాధికారెడ్డి. రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి చందురాజు, మండల కన్వీనర్ మణి(శ్రీరంగరాజపురం) సర్పంచ్ ధనంజయవర్మ, నాయకులు పట్నం ప్రభాకర్రెడ్డి. కుప్పయ్య, శేషాద్రి, మునికృష్ణ, వెంకటేష్ నందగోపాల్, మురళీ, మోహనకుమారి, సుమతి పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవం

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: ఈనెల 11 నుండీ 18వ తేది వరకు జరుగుతున్న అంతర్జాతీయ బాలికా దినోత్సవం వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి ఆదేశాలతో సోమవారం చిత్తూరు నగర పరిధిలోని కస్తూర్బా పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవంపై అవగాహన కల్పించారు. డిపిహెచ్‌ఎంఒ రోజారాణి మాట్లాడుతూ బాలికలు శారీరకంగానూ, మానసికంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాలలనూ ముందంజలో ఉండాలని, వారిపై లింగ వివక్షత చూపరాదని సేవ్ గర్ల్ చైల్డ్ భావనతో ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని, బాలికల, బాలుర నిష్పత్తి సమానంగా ఉండేలా చూడాలని తెలిపారు. బాలికలకు తమ హక్కుల పట్ల అవగాహన కల్పించడానికి లింగ వివక్షత రూపుమాపడానికి, మహిళా సాధికారత కోసం పోరాటం అనేది బాలికాదినోత్సవం ముఖ్య లక్ష్యం అన్నారు.

అలసత్వం చేయొద్దు: ఎస్‌పి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదు దారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్.పి తుషార్ డూడి, ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా నిబద్ధతతో పని చేయాలన్నారు.

క్రైం న్యూస్

నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడ్డ నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. సోమవారం మండలంలోని నలగంపల్లి గ్రామం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బండ్ల దొడ్డి గ్రామానికి చెందిన కోటీశ్వర్ అనుమానంతో తిరుగుతుండడంతో అదుపులో తీసుకొని విచారించగా రెండు రోజుల క్రితం బంగారుపాలెం మండలం తగువారి పల్లి పంచాయతీలో నాలుగు ద్విచక్ర వాహనాలను చోరీకి పాల్పడ్డానని తెలిపారు. కాణిపాకం, ఆర్‌సిపురం వివిధ పోలీస్ స్టేషన్లో చోరీ కేసుల్లో నిందితుడుగా గుర్తించామని ఎస్ఐ తెలిపారు. అతని వద్ద గల నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ బాబు, పోలీస్ అనిల్ , హోంగార్డు నటరాజ, సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ లిక్కర్‌పై సీబీఐ విచారణ చేయించాలి

మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మాజీ ఎమ్మెల్యే వేంకటే గౌడ ఆధ్వర్యంలో సోమవారం కల్తీ లిక్కర్ పై వైసీపీ శ్రేణులు మార్కెట్ యార్డు వద్ద ర్యాలీ చేపట్టాయి. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ చేరుకుని సీఐ భాగ్యలక్ష్మికి కల్తీ లిక్కర్ వ్యవహారం పై సీబీఐతో దర్యాప్తు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యువరాజు, హేమంత్ కుమార్ రెడ్డి, మండి సుధ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

గాలికుంటు నివారణకు టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి -కార్వేటినగరం: పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పని సరి అని అసిస్టెంట్ డైరెక్టర్ వాసు అన్నారు. వ్యాధి సోకిన పశువులకు ఉచితంగా ఇంటి వద్దనే చికిత్స అందించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా కార్వేటినగరం మండలం ఎర్రమరాజుపల్లి పంచాయతీలో పశువులకు ఉచితంగా 120 టీకాలు వేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, శరణ్య, రాజా , మురళి పాల్గొన్నారు.

ఎం మహేష్ స్వేరోకి ప్రత్యేక సన్మానం

ప్రజాశక్తి-ఐరాల: వే ఫౌండేషన్ 12వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా తిరుపతి నగరంలోని మహతి ఆడిటోరియంలో నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవం కార్యక్రమంలో ప్రముఖ ట్రైనర్, సోషల్ యాక్టివిస్ట్ ఎం మహేష్ స్వేరోకిఘన సన్మానం నిర్వమించారు. సుదీర్ఘంగా తాను చేస్తున్న సమాజ సేవకు, వివిధ విద్యాసంస్థలలో, ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు కొన్ని సంవత్సరాలుగా ఉచిత ట్రైనింగ్ ఇస్తూ విద్యార్థులను మోటివేట్ చేస్తూ పలు విధాలుగా వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న సందర్భంగా వే ఫౌండేషన్ నిర్వాహకులు డా పైడి అంకయ్య, సాంస్క్రిట్ విద్యాపీట్ ఉపకులపతి కృష్ణమూర్తి, బిఎస్‌పి జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, ఇతర ముఖ్య అతిథులు, ఇతరుల సమక్షంలో ప్రత్యేకంగా సన్మానించారు. ఎం మహేష్ స్వేరో చేస్తున్న కార్యక్రమాలను ముఖ్య అతిథులు ప్రత్యేకంగా అభినందించారు.

వెంకటేష్‌పై ఆరా

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: బాలయ్య కొత్తూరు గ్రామానికి చెందిన బాలుడు వెంకటేష్ గురించి జిల్లా ఐసిడిఎస్ శాఖ అధికారులు స్పందించారు ఈ సందర్భంగా సోమవారం ఆ శాఖ సంబంధించిన అధికారులు సచివాలయం అధికారులతో కలిసి గ్రామంలో బాలుడు కుటుంబ సభ్యుల అదేవిధంగా గ్రామంలో ప్రజల దగ్గర విచారణ ద్వారా విషయాలు తెలుసుకొన్నారు. వివిధ దినపత్రికల ద్వారా బాలుడు వెంకటేష్ ఎదుర్కొంటున్న లివర్ సమస్య ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ విషయంగా జిల్లా ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరి స్పందించి తన సిబ్బంది ద్వారా బాలుడు విషయాలు నివేదిక అందజేయాలని ఆదేశించారు ఆ మేరకు ఆ శాఖకు సంబంధించిన అధికారులతో పాటు సచివాలయం అధికారులు కలిసి బాలయ్య కొత్తూరులో బాలుడు వెంకటేష్ గల లివర్ సమస్యపై వారి కుటుంబ సభ్యులు, అలాగే గ్రామస్తులు దగ్గర విచారించి విషయాలు తెలుసుకున్నారు. సేకరించిన విషయాలను రిపోర్ట్ తయారుచేసి జిల్లా ఐసిడిఎస్ పిడికి అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ డి సి పి యు కౌన్సిలర్ ఉష , పంచాయతీ సెక్రెటరీ శిరీష, మహిళ పోలీస్ జయశ్రీ, వెల్ఫేర్ అసిస్టెంట్ జనార్ధన్, అంగన్వాడీ టీచర్, టీడీపీ నేతలు నీరజాక్షల రెడ్డి, రాఘవేంద్ర ,సంపత్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరం

ప్రజాశక్తి -సోమల: మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామ పరిధిలోని గ్రామాలలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్ ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా జయశంకర్ మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లపై మురుగునీటి కాలువలలో వర్షపు నీరు నిలిచి దోమలు ప్రబలుతున్న కారణంగా పారిశుధ్య పనులు చేపట్టి చుట్టుపక్కల పిచ్చి మొక్కలను తొలగించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి సంతాపం

ప్రజాశక్తి- రామకుప్పం: మండల పరిధిలోని పంధ్యాలమడుగు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మునివెంకటమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతి పట్ల స్థానిక టిడిపి నేతలు తమ సంతాపం వ్యక్తతం చేస్తూ, మృత దేహానికి పూల మాలలు వేసి నివాళు లార్పించారు.ఆమె కుటుంబానికి కార్యకర్తల సహాయం తో పన్నెండు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, జిల్లా ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ కృష్ణ నాయక్,క్లస్టర్ ఇంచార్జి రవిరెడ్డి, చంద్రా రెడ్డి, పరుశురాం, గజేంద్ర, మునిరాజ్, మురుగేష్, రమణ, వినోద్, వేంకటాచలం ఉన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లాలో ప్రభుత్వ హాస్పిటల్ లో పనిచేయు శానిటేషన్ కార్మికులకు పెండింగ్లో ఉన్న మూడు నెలలు జీతాలు చెల్లించాలని కొన్ని హాస్పిటల్ లో వయోపరిమతి 50 సంవత్సరాల వచ్చిన కార్మికులను పని నుంచి తొలగించడానికి వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్ర సమితి పిలుపు మేరకు చిత్తూరు కలెక్టర్ కార్యాలయం దగ్గర ఆ యూనియన్ జిల్లా నాయకులు భారతి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు.

చేపల చెరువు వేలం నిర్వహించండి: మాజీ సర్పంచ్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: చేపల చెరువు వేలం నిర్వహించాలని మాజీ సర్పంచ్ విజయ్ కుమార్ డిమాండు చేశారు. మండలంలోని పాలేరు పంచాయతీలోని చిల్లా మల్ల చెరువుకు సంబంధించి చేపల చెరువు వేలం సోమవారం నిర్వహించాలని ఎంపీడీవో మహేష్ బాబుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి నుండి జులై వరకు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి లీజుకు తీసుకున్నాడని, లీజు గడువు జులై మాసం చివరి తేదీతో ముగిసిందని కానీ అప్పటి నుండి అతనే చేపలను పడుతున్నాడని తెలిపారు. పంచాయతీకి రావాల్సిన నిధులకు గండి కొట్టడంపై పై అధికారులు చర్యలు తీసుకుని, చేపల చెరువుకు వేలం వేసి పంచాయతీకి ఆదాయం వచ్చేందుకు కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారని దీన్ని పరిశీలించి వేలం పాట నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శివారెడ్డి, కేశవులు, వేణుగోపాల్ రెడ్డి, బాలాజీ, మార్ కొండయ్య, రామస్వామి, రాజయ్య పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న మాజీ సర్పంచ్

తాగునీటి పైపులైను ఏర్పాటు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: వెదురు కుప్పం ఎస్టీ కాలనీలో ఇంటింటికీ తాగునీటి వసతి కల్పిం చేందుకు ఎంపీటీసీ ఎన్ రాధిక పురంధర్ రెడ్డి చర్యలు చేపట్టారు. మండల పరిషత్ నిధుల నుంచి రూ. 3.70 లక్షలు కేటాయించారు. వీటి ద్వారా పురవీధుల్లో పైపులైన్లు, కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు స్థానిక ఎంపీటీసీ రాధిక పురంధర్ రెడ్డి సోమవారం మీడియాకు తెలిపారు. ఈ సమా వేశంలో ఆయన వెంట బత్తల చిరంజీవి రెడ్డి, పేట రమేష్ రెడ్డి, వాసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి పైపు లైను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

దగ్గుమాటి శ్రీహరిరావును సన్మానిస్తున్న జనసేన నాయకులు

దగ్గుమాటి శ్రీహరిరావుకు సన్మానం

ప్రజాశక్తి-ఐరాల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చైర్మన్ దగ్గుమాటి శ్రీహరిరావుని చిత్తూ రు జిల్లా జనసేన నాయకులు ఎం మహేష్ స్వేరో తన బృందంతో తిరుపతిలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎం మహేష్ స్వేరో మాట్లాడుతూ సుదీర్ఘ అనుభవం ఉన్న సీనియర్ డాక్టర్, ప్రముఖ రేడియాలజిస్ట్ దగ్గుమాటి శ్రీహరిరావు ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ కావడం చాలా మంచి పరిణామమని, ఆయన ఆధ్వర్యంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ రెట్టింపు స్థాయిలో పనిచేస్తుందని, వ్యవస్థీకృత మార్పులతో చాలా కీలకంగా వ్యవహరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నీరుగట్టు నగేష్, జనసేన నాయకులు సోంబాబు, యువరాజ్ స్వేరో, అజిత్ శ్రీరాముల, కిరణ్ కుమార్ స్వేరో, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలోనే కల్తీ మద్యం: టిడిపి

ప్రజాశక్తి -కార్వేటినగరం:

వైసిపి ప్రభుత్వంలోనే కల్తీ మద్యం తాగి రాష్ట్రంలో ఎన్నో ప్రాణాలు కోల్పోయారని టిడిపి మండల అధ్యక్షులు చెంగల్రాయల యాదవ్ అన్నారు. సోమవారం ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో ఆయన మాట్లాడుతూ 2024 వరకు వైసీపీ ప్రభుత్వమే కల్తీ మద్యం అమ్మి ఎన్నో పేద కుటుంబాలు గాలిలో కలిసిపోయాని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో గ్రావెల్లో అవినీతి మద్యంలోనూ కల్తీ వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ జనార్ధన్ రాజు, బీసీ సంఘ అధ్యక్షులు రవి యాదవ్, ఎమ్మెల్యే సోదరులు వీ రాజా, మండల ఉపాధ్యక్షులు సోమశేఖర్, మండల తెలుగు యువత అధ్యక్షులు మురళీమోహన్, పవన్ కుమార్, షేక్ సందాని, డంక నియాజ్, యాకూబ్, రెహమాన్, చంగల్ రాయులు, లక్ష్మణ రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి -పలమనేరు:

పలమనేరు శ్రీ కాశీ విశ్వేశ్వర దేవస్థానం ఆలయ కమిటీ సభ్యులు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం కలిసి సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ గా ఆర్ మురళీకృష్ణ, సభ్యులుగా జి మంజు, పెద్ద రెడ్డప్ప,మోహన మురళి, వీరప్ప,మోహన ప్రియ, సుజాత, భువనేశ్వరి, సరిత, ప్రసాద్, కుమారస్వామి, సత్యవతి బాబులు ఉన్నారు. ఆలయ కమిటీలో చోటు కల్పించినందుకు ఈ సందర్భంగా ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల మనోభావాలకు అనుగుణంగా కమిటీ సభ్యులు పనిచేయాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞానం పెంపునకే చెకుముకి పోటీలు

ప్రజాశక్తి -కార్వేటినగరం: విద్యార్థులో సైన్స్‌పై మక్కువ పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక చెకుముకి పోటీలు నిర్వహిస్తున్నాయని మండల విద్యాశాఖ అధికారి విజయకుమార్ అన్నారు. సోమవారం చెకుముకి సైన్స్ సంభరాలకు సంబందించిన గోడపత్రిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా జనవిజ్ఞాన వేదిక విద్యార్థులకు సైన్స్ పట్ల మక్కువ పెంచేందుకు చెకుముకి పోటీలు నిర్వహిస్తున్నాయని అన్నారు. ఈ పోటీలు మండల స్థాయిలో ఈ నెల 18వ తేదీ నిర్వహించడం జరుగుతుందని, అలాగే జిల్లా స్థాయిలో 23వ తేదీ, రాష్ట్ర స్థాయిలో డెసెంబరు 12, 13, 14 తేదీల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్న వచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో 2 మనోజ్‌కుమార్, జన విజ్ఞాన వేదిన కన్వీనర్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు మునీంద్ర, వేణుగోపాల్ రెడ్డి కన్నయ్య, రామోహన్, పలువురు పాల్గొన్నారు.

దీక్షకు మద్దతుగా నిరసన

ప్రజాశక్తి - పలమనేరు రూరల్ (గంగవరం): గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది తమ హక్కుల సాధన కోసం నిరాహార దీక్షకు మద్దతుగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భోజన విరామ సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు మద్దతుగా సిబ్బంది సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిఎస్, సూపరువైజర్లు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న పిహెచ్‌సి సిబ్బంది

స్వామి వారి సేవలో నంది అవార్డు గ్రహీత

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు పంచాయతీ, దుద్దే రామానాయుడు కండ్రిగ సమీపంలో అరుణగిరిపై వెలసిన కొండమల్లీశ్వర స్వామి ని నంది అవార్డు గ్రహీత చక్రధర సిద్ధాంతి దర్శించుకున్నారు. సోమవారం ఆయనకు ఆలయ అర్చకులు స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు కార్తీక పౌర్ణమి ప్రవచనాలు, విశిష్టతను వివరించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

కంటి చికిత్సకు 20 మంది ఎంపిక

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: కంటి చికిత్సకు 20 మంది ఎంపికైనట్టు చెన్నై శంకర్ నేత్రాలయ విజన్ ఫర్ మిషన్ నిర్వాహకులు మురళి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి మండలం లోని పలు గ్రామాల నుంచి 46 మంది కంటి పరీక్షలు చేసుకోగా అందులో 20 మందికి సమస్యలు ఉన్నట్టు గుర్తించి వీరికి చెన్నైలోనే శంకర్ నేత్రాలయంలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసి తగిన మందులు అందిస్తామన్నారు. ప్రతి నెల రెండవ సోమవారం మండల అభివృద్ధి కార్యాలయంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని సమస్యలు ఉన్నవారు శిబిరానికి హాజరై పరీక్షించుకోవాలన్నారు.

సోమలకు ఐదుగురు ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -సోమల : సోమల మండలానికి డీఎస్సీ 2025 లో క్వాలిఫై అయి శిక్షణ పూర్తి చేసుకుని ఐదుగురు ఉపాధ్యాయులు విధులలో చేరినట్లు ఎంఈఓ లు విజయకుమారి శివ రత్నమ్మ తెలిపారు. ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా ఒకరు, నలుగురు ఎస్జీటీలుగా బాధ్యతలు చేపట్టారని వారు తెలిపారు. నూతన ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ కార్యాలయానికి చేరుకొని ఎంఈఓలను కలిశారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిలు పాల్గొన్నారు. సూరయ్య గారి పల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ విజయకుమారి ఎఫ్ఎ టు ఎగ్జామ్స్ ఎలా జరుగుతున్నాయో నేరుగా వెళ్లి పరిశీలించారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని కోరారు.

ప్రతి అర్జీ పరిష్కారమే ధ్యేయం: తహశీల్దారు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ప్రతి అర్జీదారుని సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని తహశీల్దారు బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం తహశీల్దారు కార్యాలయంలో పలువురు పలు సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు వినతి పత్రాలు పరిశీలించి ఆ గ్రామాల్లోని వీఆర్వోలకు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించే విధంగా సూచనలు, సలహాలు చేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు కళ్యాణి, మండల సర్వేయర్ లావణ్య, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలంలోని దేవళంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్పందన ఫౌండేషన్ ద్వారా వడ్లపట్ల శ్యామలాదేవి బోధనోపకరణ మెటీరియల్ ఆటల సమ దుస్తులు విద్యార్ధినివిద్యార్థులకు సోమవారం పంచి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. పిల్లల సర్వతో ముఖాభివృద్ధికి తన వంతు తాను నిరంతరం కృషి చేస్తున్నానని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాయక్ ప్రసంగిస్తూ శ్యామలాదేవి నిరంతరాయంగా అనేక పాఠశాలల విద్యార్థులను దత్తత తీసుకొని స్పందన ఫౌండేషన్ ద్వారా సేవలందిస్తూ ఉన్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రం

ప్రజాశక్తి-కుప్పం: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని భావి భారత పౌరులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులపైనే ఉందని ఎంఈఓ కుమారి పేర్కొన్నారు. డీఎస్సీ 2025లో ఎంపికైన కుప్ప మండలానికి సంబంధించిన ఉపాధ్యాయులతో ఎంఈఓ సమావేశం అయ్యారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సులభమైన పద్ధతిలో విద్యాబోధన చేయాలని వారికి సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని ఏవైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవులు పాల్గొన్నారు.

శ్మశానాన్ని రక్షించండి

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : మండలంలోని ఓజీ కుప్పం గ్రామంలో శ్మశాన స్థలం ఆక్రమణకు గురవుతోందని ఆ స్థలాన్ని కాపాడాలంటూ వైస్ ఎంపీపీ కన్నియప్ప ఆధ్వర్యంలో గ్రామస్తులు తహశీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి ఉన్న స్థలాన్ని కొందరు రాళ్లుపేర్చి ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని అలా చేస్తే శ్మశానం కుంచించుకుపోయి అందరికీ ఇబ్బందులు ఎదరవుతోందన్నారు. శ్మశాన స్థలాన్ని కాపాడాలంటూ విన్నవించుకున్నారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ స్థలాన్ని పరిశీలిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మధు, నాగరాజు పాల్గొన్నారు.

అనధికార లే అవుట్‌లను క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి-పలమనేరు: ఈ నెల 23వ తేదీ లోపు అనధికారి లే అవుట్‌లను క్రమబద్ధీకరించుకోవాలని అధికారులు సూచించారు. మున్సిపల్ కమిషనర్ కార్యాలయ ఛాంబర్ లో అనంతపురం రీజినల్ డిప్యూటీ టౌన్ ప్లానింగ్ డెరెక్టరు సందీప్ కుమార్ అధ్యక్షతన పలమనేరు, పుంగనూరు, కుప్పం పురపాలక సంఘ పరిధిలోని ఎల్‌టిపిలు, లేఔట్ యజ మానులు, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికార లే అవుట్‌ల క్రమ బద్ధీకరణను ఈ నెల 23వ తేదీ లోపు చేసుకోవాలన్నారు. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రోత్సాహకాలు పొందాలని సూచించారు. పురపాలక సంఘ పరిధిలోని అనధికార లే ఔట్ల యజమానులు, ప్లాట్ లబ్ధిదారులు విధిగా 30 అడుగుల రోడ్‌కలిగి ఉండాలని, డ్రైన్స్, నీటి పైప్ లైన్‌లు తదితర మౌలిక వసతులు కల్పనకు వీలుగా ప్లాట్లను నిర్ణీత గడువు లోగా క్రమ బద్ధీకరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎన్‌వి రమణా రెడ్డి, ఇందిర, లేఔట్ యజమానులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారులు

డిఎస్‌సి ఉపాధ్యాయులకు అభినందనలు

ప్రజాశక్తి -యాదమరి: యాదమరి మండల వనరుల కేంద్రంలో 2025 డిఎస్‌సి ద్వారా వచ్చిన ఉపాధ్యాయులకు టీచర్స్ యూనియన్ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యాదమరి ఎంఈవో రుక్మణమ్మ మాట్లాడుతూ యాదమరి మండలానికి 2025 డీయస్ సి ద్వారా ముగ్గురు ఉపాధ్యాయులు గౌతమి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు పాఠశాల తెల్లరాళ్లపల్లి, నేతాజీ ఎంపీపీ పాఠశాల ఎంవిపై కాలనీ, షేక్ అయూబ్ పాఠశాల, ఎంపీపీ ఎస్ ఉర్దూ 12- కమ్మపల్లి కు నియామకం పొందారని తెలుపుతూ నూతన ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. నూతన ఉపాధ్యాయులకు చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్షులు మదన్ మోహన్ రెడ్డి, యాదమరి మండల శాఖ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం పిళ్లై, యుటిఎఫ్ నాయకులు సర్దార్ అభినందనలు తెలిపారు.

నూతన ఉపాధ్యాయులను అభినందిస్తున్న ఎంఈవో

జీఎస్‌టీపై అవగాహన

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో సూపర్ జి.ఎస్.టి- సూపర్ సేవింగ్స్ కార్యక్రమానికి పలమనేరు ఎమ్మెల్యే ఎన్. అమరనాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిఎస్టి పై తీసుకున్న నిర్ణయంతో పేద, మధ్య తరగతి ప్రజలకు చేకూరే ప్రయోజనాలను ఆయన వివరించారు. అనంతరం ఆయన బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి, బాలాజీ కో-ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు అర్వీ బాలాజీ, నాయకులు కుట్టి, గిరి, సుబ్రహ్మణ్యం గౌడ్, నాగరాజు, ఖాజా పీర్, బిఆర్సి కుమార్, మదన్, కిరణ్, శ్రీధర్, అమరనాథ రెడ్డి, రూపేష్, సుధాకర్, జనసేన నాయకులు హరీష్, అరుణ్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

రామకుప్పం: ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన తగ్గింపు జీఎస్టీ పై అవగాహన కోసం సోమవారం రామకుప్పం లో తహశీల్దార్ కౌలేష్, ఎంపీడీవో మురళీకృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ బాలాజీ ,చిత్తూరు జిల్లా జిఎస్టి అడిషనల్ కమిషనర్ ఇంతియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు.
దీంతోపాటు జీఎస్టీ తగ్గింపు పై ఉన్న వసతులను, కరపత్రాలు ద్వారా గ్రామంలోని ప్రధాన రహదారి లోని దుకాన దారులకు, ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో వివిధ శాఖల అధికారులు, వ్యాపారులు, స్థానికులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు తొమ్మిది వినతులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీ ఆర్ఎస్) కార్యక్రమంలో తొమ్మిది వినతులు అందినట్లు నగర సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గతవారం అందిన వినతుల పరిష్కారంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డి ఈ ప్రసాద్ నాయుడు, ఏఈ జై చంద్ర రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కిషోర్ పాల్గొన్నారు.

రక్త పరీక్షలతో ఆరోగ్య సంరక్షణ

ప్రజాశక్తి- రామకుప్పం: ప్రతి ఒక్కరూ రక్త పరీక్షలు చేయించుకొని శ్రద్ధతో తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని రాష్ట్ర గ్రంధాలయ బోర్డ్ డైరెక్టర్ మునస్వామి పేర్కొన్నారు. సోమవారం విజలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కే.పూజిత ఆధ్వర్యంలో బల్ల పంచాయతీ పరిధిలో ఉండే పాలు రేపు గడ్డ గ్రామంలో, ఆనిగానూరు సచివాలయం పరిధిలో ఉన్న పెద్దగానూరు గ్రామంలో యూనివర్సల్ బ్లడ్ శాంపిల్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు దాదాపు 49 రకాల రక్తపరీక్షలు చేపట్టారు. వీరిలో భాగంగా కొలెస్ట్రాల్ మధుమేహం మరియు కిడ్నీ లివర్ ప్రొఫైల్ సిబిసి, పూర్తి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో నాగ భూషణం, సతీష్, శ్రీనివాసులు, మహేంద్ర నాయుడు, చంద్రమోహన్, యర్రప్ప, వైద్య సిబ్బంది బాలు, ఎం ఎల్ హెచ్ పి పుష్ప, శ్రావణి,సంధ్య, ఏఎన్ఎం రాధా, సుకన్య, ఆశ వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: లింగ నిర్ధారణ చట్టరీత్యానేరం అని హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ పేర్కొన్నారు. లింగ నిర్ధారణనేరంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. చిత్తూరు జిల్లాలో ఆడబిడ్డల శాతం గణనీయంగా తగ్గిందని, అమ్మాయి జన్మించేది సంపూర్ణంగా జీవించడానికే అన్నారు. ఆడ, మగ తేడావద్దని లింగవివక్షను అరికట్టాలన్నారు. సమాజానికి, కుటుంబానికి బాలిక ఒక ఆణి ముత్యం అన్నారు. నేటి ఆడపిల్లె రేపటి అమ్మ అని,ఈరోజు ఆడపిల్లను వద్దు అనుకుంటే రేపు మన సమాజం అమ్మలేని అనాధ అవుతుందని వివరించారు. గుడ్ టచ్ బ్యాడ్ ట చ్ గురించి, సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ సాయి దివ్య, ప్రిన్సిపాల్ సుమిత్ర, ఎస్ఎస్ కె. రాధ కుమారి ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టపాకాయల విక్రయాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: దీపావళి సందర్భంగా మండల పరిధిలో తాత్కాలిక టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేయాలనుకునే వ్యాపారులు తప్పనిసరిగా స్థానిక పోలీస్ స్టేషన్లో ధరఖాస్తు చేసుకొని ముందస్తు అనుమతి పొందాలని ఎస్ఐ మారెప్ప సూచించారు. అనుమతి లేని దుకాణాలపై ఎక్స్‌ప్లోజివ్స్ యాక్ట్ ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. దుకాణాలు ఖాళీ ప్రదేశాలలో మాత్రమే ఉండాలని,ఎన్.ఒ.సి. సర్టిఫికేట్ తప్పనిసరి అని పేర్కొన్నారు. జనసంచారం ఎక్కువ ఉండే ప్రదేశాలు లేదా కల్యాణ మండపాల వద్ద షాపులు ఏర్పాటు చేయరాదని, విక్రయ ప్రాంతంలో అగ్నిమాపక, భద్రతా చర్యలు తప్పక తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

వరద ప్రాంతాల్లో తక్షణ ఉపశమన చర్యలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: నగరపాలక పరిధిలోని నీవా నది పరివాహక ప్రాంతాల్లో వరద ఉద్ధతి పెరిగిన నేపథ్యంలో నగర పాలక అధికారులు, టిడిపి నాయకులు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆదేశించారు. స్థానిక ప్రజలకు తక్షణ సహాయ సహకారాలు అందించాలన్నారు. నదిలో నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ స్థానిక ప్రజలను అప్రమత్తం చేయాలని, వర్షాలు మరికొన్ని రోజులు కొనసాగనున్న నేపథ్యంలో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ :

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నగరపాలక ఆరోగ్యాధికారి డా. లోకేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో సీజనల్ వ్యాధుల నియంత్రణ, తీసుకోవాల్సిన చర్యలపై వైద్యాధికారులు, సూపర్వైజర్లు, ఆరోగ్య కార్యదర్శులు, మలేరియా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అర్బన్ ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సూపర్వైజర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

యువతకు వివిధ అంశాలలో పోటీలు

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యములో యువతకు అనేక అంశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీలలో గెలుపొందిన వారిని జిల్లాస్థాయి నుండి రాష్ట్రస్థాయి పోటీలకు, అదేవి రాష్ట్ర స్థాయి నుండి జాతీయ స్థాయిలో జరిగే జాతీయ యువ జనోత్సవాలకు పంపుతామన్నారు.

విద్యాసామగ్రి వితరణ

ప్రజాశక్తి -సోమల(సదుం): సదుం మండలం బట్టువారిపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పీపుల్స్ గ్రో పాఠశాలలో యోగా టీచర్ గా పని చేస్తున్న స్నేహ విద్యార్థులకు 5000 రూపాయల విలువైన విద్యా సామాగ్రిని సోమవారం పాఠశాలలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి నటరాజన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని పెంపొందించుకోవాలని యోగ ఉపాధ్యాయురాలు స్నేహ ఎంతో మంచి మనసుతో విద్యార్థులకు విద్యా సామాగ్రిని పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ బాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు అభివృద్ధి పథంలో పయనించాలని సేవాభావంతో యోగా ఉపాధ్యాయురాలు స్నేహ విద్యార్థులకు నాణ్యమైన విద్య సామాగ్రిని అందించడం విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది కృష్ణమూర్తి, దీప, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS, TIRUPATI
I.A.No. 11/2025, ARC.No. 85/2025
M/s Margadarsi Chit Fund Pvt.Ltd., Tirupati
Rep.by its Manager/Foreman ...Disputant
V/s
Mr.A.Chiranjeevulu & Others ...Opponents
I A Notice to Opponent No.5
Opp. No.5) Mr.Sowdepalli Uday Kumar, S/o.S.Guravaiah, aged 31 Years, D.No.8-31, Sowdepalli, Mambedu (P), Vedurukuppam Mandal, Chittoor District 517519. (Property Holder: D.No.8-31, Sowdepalli, Mambedu (P), Vedurukuppam Mandal, Chittoor District 517519).
Please take notice that the above Dispute is posted to **15-11-2025** for your appearance before the above said Honourable District Registrar/ Arbitrator Office, Tirupati at 10:30 A.M., either in person or through an Advocate and raise your objections if any, failing which the case will be decided in your absence as exparte.
Hearing Date: 15-11-2025
K.RAMESH BABU
Advocate, Tirupati. Cell No. 9440095932